క్లుప్తంగా

ఎరువుల ర్యాక్‌పాయింట్ అధికారుల పరిశీలన



నాదెండ్ల: సాతులూరు రైల్వే ఎరువుల ర్యాక్ పాయింట్‌ను జిల్లా వ్యవసాయాధికారి ఎం. జగ్గారావు శనివారం పరిశీలించారు. నరసరావుపేట ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు, స్థానిక ఏవో శ్రీలతతో కలిసి ర్యాక్ పాయింట్ వద్ద ఉన్న దిగు మతి రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం యూరియా కేటాయింపుల ప్రకారం డీలర్లు, సొసైటీలకు చేరుతుందా లేదా అని తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువుల అందుబాటు వివరాలు, యూరియా కొరతపై ఏవోలతో చర్చించారు.

పాఠశాలకు ట్రీగార్డ్స్ అందజేత



వినుకొండ: పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలో గల జడ్పీ హైస్కూల్‌కు 20వ వార్డు కౌన్సిలర్ నంది నరసింహారావు 50 ట్రీ గార్డ్స్ అందజేసినట్లు హెచ్ఎం సీహెచ్. వీరప్పయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో దాత నరసింహా రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ ఆర్.రాధాకృష్ణమూర్తి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎస్.పద్మజ, ఎలీషా, రాంబాబు, ఎలిజబెత్ రాణి, మల్లయ్య, శాంతి, గోవిందునాయక్, చంద్రశేఖర్, రామాంజనేయులు, గాయత్రి, సంధ్య, కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ఎంపీపీ తలతోటి రాణి సూచన

నాదెండ్ల: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పాటూ మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి, సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, డీటీ సాల్మన్, డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం



నాదెండ్ల: కనపర్రు బీపీఆర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న వై. రాజ్యలక్ష్మి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. 2017 నుండి కనపర్రు బీపీఆర్ ప్రాథమిక పాఠశాలలో అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని కల్పించి వారి పిల్లలు పాఠశాలలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. ఆమె పనితీరును గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం అందించటంపై తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

లక్షలు పలికిన గణనాథుడి లడ్డూ



రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో వినాయకుని పందిట్లో పూజలు అందుకున్న 11 కేజీల లడ్డూ ప్రసాదాన్ని ఆ గ్రామానికి చెందిన మోతుకూరి శ్రీనివాసరావు రూ.3.60 లక్షల రూపాయలకు శనివారం వేలంలో దక్కించుకున్నారు. అలాగే వి.రెడ్డిపాలెం గ్రామంలోని వినాయకుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ పందిట్లోని లడ్డూ ప్రసాదాన్ని గంగారపు కొండారెడ్డి రూ.24 వేల రూపాయలకు వేలంలో పాడుకున్నారు. ఈ విగ్రహాలను మేళతాళాలతో జైగణేష నామస్మరణతో అద్దంకి, గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు తరలించి నిమజ్జనం చేశారు.

మహిళా సభ్యులు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్‌డీఏ పీడీ పి.ఝాన్సీలక్ష్మి



మాట్లాడుతున్న ఝాన్సీలక్ష్మి

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల్లోని సభ్యులు అభ్యున్నతికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని జిల్లా డీఆర్‌డీఏ పీడీ పి.ఝాన్సీలక్ష్మి కోరారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్యా సమావేశం వీవోఏ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ రుణాలు పొందిన మహిళలు యూనిట్స్ ఏర్పాటు చేసుకొని జీవనోపాదులు పెంపుదలకు కృషి చేయాలన్నారు. ఎస్‌బీఐ నరసరావుపేట రీజనల్ బ్యాంకు సారథ్యంలో జిల్లాలో 3025 మహిళా సంఘాలు ఉండగా 3 వేల గ్రూపులకు సూక్ష్మ రుణ ప్రణాళిక రుణాలు మంజూరు చేయడానికి రూ.308 కోట్లు పరిపాలన ఆమోదం పొందినట్లు తెలిపారు. 13 సెంట్లు స్థలంలో షేర్ నెట్‌లు యూనిట్‌కు అయ్యే ఖర్చు రూ. ఒక లక్ష 60 వేలు అవుతుందని ఇందుకుగాను 50 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. కలెక్టరు సారథ్యంలో పల్నాడు జిల్లాను త్వరలో ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్పు చేస్తున్న నేపథ్యంలో జూట్ సంచులు తయారీ చేయటానికి యూనిట్స్ ఏర్పాటు చేయాలని ఉత్పత్తులు ఆధారంగా ప్రభుత్వ పరంగా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమావేశంలో ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు వలేటి ప్రసాదు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ఇన్‌చార్జ్ ఏపీయం అబ్బురి రామారావు, డీపీఎం శ్రీనివాసరావు, జిల్లా జీవనోపాదుల అధికారి జి.వాసుబాబు, ముండ్రు బ్రహ్మయ్య, సీసీలు మేరికుమారి, సెక్రటరి వేగుళ్ల కుమారి వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ- పంట నమోదు చేసుకోవాలి

బొల్లాపల్లి: ఉద్యాన పంటల సాగు రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి షేక్ నబీ రసూల్ తెలిపారు. మండల కేంద్రం బొల్లాపల్లిలో పొలాలను సందర్శించి, కొబ్బరి, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు ఈ నెల 30 వరకు ఈ పంట నమోదు గడువు ఉందని తెలిపారు. ఈ పంట నమోదుతో పంట బీమా వర్తిస్తుందని, విపత్తు సమయంలో పెట్టుబడి రాయితీ, బ్యాంకుల నుంచి రుణాలు పొందడం, ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీ పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి తెలియజేశారు కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు శెట్టి భార్గవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులూ... ఆందోళన వద్దు!!



సంచులు పంపిణీ చేస్తున్న ఏవో

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని అంగలూరు సొసైటీ పరిధిలో యూరియా నిల్వలు 23 టన్నులు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ప్రభుత్వం నిబంధనలు మేరకు ప్రతి రైతుకు యూరియా డీఏపీ ఎరువులు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే ఈపూరు సొసైటీలో 20 టన్నుల యూరియా సంచులు వచ్చినట్లు తెలిపారు. ఇనిమెళ్ళ, ముప్పాళ్ళ కొండ్రముట్ల యూరియా నిల్వలు వస్తాయన్నారు. రైతులు సాగు చేయు పంటల ఆధారంగా ఎరువులు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి బాలగురవయ్య, సీఈవో కోటేశ్వరరావు, రైతులు ఉన్నారు.అలాగే రైతులు యూరియా ఆగచాట్లు పడకుండా ముందుస్తు చర్యలు చేపట్టినట్లు ఏడీఏ రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

పేద విద్యార్థులకు ఉల్లాస్ చేయూత



ఆర్థికసాయం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నాదెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పేద కుటుంబాలకు చెందిన పది మంది విద్యార్థులకు ఉల్లాస్ స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. శనివారం గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న మెరిట్ విద్యార్థులు పది మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి ఆర్థికసాయంగా అందించినట్లు హెచ్ఎం ఐ కృష్ణానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ళ నుంచి పోలారిస్ సంస్థలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వారి జీతభత్యాల నుంచి కొంత నగదును పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మెరిట్‌లో ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని ప్రతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఎంపికచేసి ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఉల్లాస్‌సంస్థ సూపర్‌వైజర్ పెద్ది సుజాత, ఎన్‌సీసీ అధికారి రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ తల్‌సైనిక్ శిబిరానికి ఎన్‌ఈసీ క్యాడెట్స్



చిన్నం మణికుమార్



లిఖిత

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి తల్‌సైనిక్ శిబిరానికి నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కళాశాలలో చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్ చిన్నం మణికుమార్, పి.లిఖిత నందినిలు ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపికైనట్టు వివరించారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే సైనిక్ శిబిరంలో అబ్స్టాకిల్ కోర్స్, ఇంటర్ డైరక్టరేట్ షూటింగ్ పోటీల్లో ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ తరపున వీరు ప్రతినిధులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. తల్‌సైనిక్ శిబిరానికి ఎంపికైన క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్ర వర్తి, 23వ ఆంధ్రప్రదేశ్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్‌బాబులు అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందన



ఉత్తమ ఉపాధ్యాయురాలు కోటా వేదమణి

చిలకలూరిపేట: పట్టణంలోని ఆది ఆంధ్రాకాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయనిగా పనిచేస్తున్న కోట వేదమణి పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గురుపూజోత్సవం సందర్భంగా పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆమెను పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి వేదమణి చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ఆమె మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ఉన్నారని వెల్లడించారు. దీంతో పాటు ఎన్‌సీసీలో విద్యార్థులకు శిక్షణ ఇస్తారని వెల్లడించారు. ఆమెను అభినందించిన వారిలో స్కూల్ హెచ్‌ఎం ఎం.కోటేశ్వర రావు, ఉపాధ్యాయులు కె.సుధా, షేక్ జమీర్, రమేష్, చిట్టి బాబు, హనుమంతు నాయక్, ఎస్టీయూ నాయకులు మేకల కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మిలాద్ ఉన్ నబీ భారీ శాంతి ర్యాలీ

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు, నాయకులు

నరసరావుపేట: మహమ్మద్ ప్రవక్త జన్మించిన రోజు మిలాదున్‌నబీ సందర్భంగా ముస్లిం సోదరులు శుక్ర, శనివారాల్లో ప్రత్యేక ప్రార్థనలు, భారీ శాంతి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రపంచ శాంతి ర్యాలీ నాయబ్‌బజార్ పెద్దమసీదు వద్ద నుంచి ప్రారంభమై మల్లమ్మసెంటర్, గాంధీచౌక్ సెంటర్, గడియారం స్తంభం సెంటర్, మునిసిపల్ కార్యాలయం, కూరగాయల మార్కెట్, మిట్ట బజార్, పనసతోట, నాగూర్ వలి టాకీస్ సెంటర్, నిమ్మతోట, గుంటూరు రోడ్, కోట సెంటర్ తదితర ప్రధాన వీధుల గుండా సాగింది. ముస్లిం మత పెద్దలతో పాటు బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయ్‌కుమార్, నాగసరపు రాందేవ్ గుప్తా, షేక్ బాజీ, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ జిలాని మాలిక్, మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, జానీమాలాలి, ముఫ్తిఅహమ్మద్ రైస్, నుర్ హమ్మద్, సయ్యద్ ఖాదర్ బాషా, వివిధ మసీదుల పేష్ మామ్‌లు, మౌజన్‌లు, ముఫ్తీలు, మౌలానాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యుత్ శాఖ ఏఈల బదిలీ



ఏఈ కోటేశ్వరరావును సన్మానిస్తున్న ఏడీఈ అశోక్‌కుమార్

నాదెండ్ల: విద్యుత్ శాఖలో అధికారుల బదిలీలు జరిగాయి. గణపవరం ఏఈగా కె.కోటేశ్వరరావు విధుల్లో చేరారు. యడ్లపాడు ఏఈగా జయకర్, రూరల్ ఏఈగా ఎండీ మోయిన్‌బాషా, చిలకలూరిపేట టౌన్–1గా కరుణాకర్ విధుల్లో చేరారు. విధుల్లో చేరిన వీరిని ఏడీఈ అశోక్ కుమార్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గణనాథుడికి డాక్టర్ గోపిరెడ్డి పూజలు



నరసరావుపేట రూరల్: ఉప్పలపాడులోని టీం ఏకదంతా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. మండపంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీడిప్‌లో విజేతలకు డాక్టర్ గోపిరెడ్డి బహుమతులు అందజేశారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. గ్రామంలో నిర్వహించిన నిమజ్జన ఊరేగింపులో యువత, చిన్నారులు, మహిళలు సందడి చేసారు. కార్యక్రమంలో కనకా పుల్లారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, శనివారపు సుబ్బారెడ్డి, యేసిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనం అపహరణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శనివారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన పఠాన్ హుస్సేన్ షరీఫ్ తన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వెనుక సతీష్ రోడ్డులోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. కొద్దిసేపటి తర్వాత వాహనం కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

యడ్లపాడు: తిమ్మాపురం గ్రామంలో ఓ వ్యక్తి అంత్యక్రియల సమయంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బిరుదు బెన్ని (26) ఈ నెల 4న మృతి చెందారు. ఇదేగ్రామానికి చెందిన బిరుదు అంజయ్య (50) ఐదో తేదిన మృతి చెందారు. ఇరువురిని అంత్యక్రియలకు తరలిస్తున్న సమయంలో తిమ్మాపురం కొత్త బైపాస్ అండర్‌పాస్ వద్ద ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కత్తులు, కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవటంతో పలువురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి

నాదెండ్ల: పనిప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురికాకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని నాదెండ్ల సీడీపీవో శాంతకుమారి చెప్పారు. గణపవరంలోని వైఎస్సార్ స్పిన్నింగ్ మిల్లులో మిషన్ శక్తి సంకల్ప్–ఉమెన్స్ సేఫ్టీ ఎట్ వర్క్‌ప్లేస్ అనే అంశంపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ నెల 12 వరకూ ప్రతి పరిశ్రమలో కార్మికులకు అవగాహన కల్పిస్తామన్నారు. వరకట్నం, మైనర్ల వివాహాలు జరిగినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పనిప్రాంతాల్లో మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శివకుమారి, వెంకటరావు, అందె శివబాబు, షేక్ గౌసియా, వాణిశ్రీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

రొంపిచర్ల: ఉత్తమ ప్రధాన అచార్యులుగా అవార్డు అందుకున్న మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి. రవినాయక్‌ను శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. మోడల్ స్కూల్‌ను అభివృద్ధి బాటలో నడుపుతున్న ప్రిన్సిపాల్‌కు అవార్డు రావడం తమకు ఆనందంగా ఉందన్నారు. మోడల్ స్కూల్‌కు ఆయన అందించిన సేవలకు గుర్తింపే అవార్డు అన్నారు. విద్యార్థుల యొక్క సర్వతోముఖాభివృద్ధికి విద్యా, వైద్యం, క్రీడా, హాస్టల్ సదుపాయాలు కల్పించటంలో ప్రిన్సిపాల్ పాత్ర ఎంతో ఉందన్నారు. ఎన్ఎంఎంఎస్ లాంటి పరీక్షలను వ్రాయించి ఉన్నత స్థాయిలో స్కూల్‌ను నిలబెట్టినందుకు సరైన పురస్కారం దక్కిందని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుకు పాడి–పంట రెండు కళ్లు

వినుకొండ సంగం డెయిరీ మేనేజరు జానకిరామయ్య



నగదు అందజేస్తున్న జానకిరామయ్య

శావల్యాపురం: రైతుకు పాడి–పంట రెండు కళ్ళు లాంటివని వినుకొండ సంగం డెయిరీ మేనేజరు మక్కెన జానికిరామయ్య అన్నారు. శనివారం మండలంలోని చినకంచర్ల గ్రామంలో ఉన్న రెండు సంగం పాల కేంద్రాల సెంటర్ల నందు పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజరు జానకి రామయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పాడి పరిశ్రమ అభివృద్ధికి సంగం డెయిరీ నిరంతరం అండగా ఉంటూ చేయూత నిస్తుందన్నారు. సంగం డెయిరీ అమలు చేస్తున్న పథకాలు రైతులు సద్వినియోగం చేసుకొని అర్థిక ప్రగతి సాధించాలన్నారు. పాడి గేదెలకు బీమా చేయించాలన్నారు. అనంతరం రెండు సెంటర్లలో 150 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.5 లక్షల 50 వేలు నగదును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టరు గడుపూడి అంజనేయులు సూపర్‌వైజరు కిరణ్, వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టరు గోనుగుంట్ల నాగరాజు, సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, సెంటరు ప్రతినిధులు రాయ వెంకటేశ్వర్లు, దావులూరి యల్లమంద, రైతులు పురేటి వెంకటరావు, మాజీ సర్పంచ్ వడ్లమూడి కోటయ్య రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

నూజెండ్ల: నియోజకవర్గ సెక్టార్ పరిధిలోని వినుకొండ రూరల్, నూజెండ్ల, శావల్యాపురం మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కె.వాణి తెలిపారు. వినుకొండ మండలం నాగులవరం, నూజెండ్ల మండలం జె.సి.నగర్ సెంటర్‌లకు కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని వరుసగా ఎస్సీ, ఎస్టీకి కేటాయించటం జరిగిందన్నారు. సహాయకురాలు ఖాళీలు వినుకొండ మండలం వెంకుపాలెం–2 (జనరల్), హసన్నాయుడు పాలెం (జనరల్), పిట్టంబండ–1 (బీసీ.బి), పిట్టంబండ–3 (ఎస్సీ), పానకాలపాలెం (జనరల్), నర్సనాయునిపాలెం (జనరల్), వెంకుపాలెం–1 (ఎస్సీ), శావల్యాపురం –4 (ఎస్టీ), కొత్తలూరు–1 (జనరల్), నూజెండ్ల మండలం లో కొత్తరెడ్డిపాలెం (జనరల్), జడ్డావారిపాలెం (జనరల్), రెడ్డికొత్తూరు (జనరల్) ఉండగా రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేయటం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు స్థానిక మహిళ అయి, 35 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పూర్తి చేసిన దరాఖాస్తులు ఈ నెల 20వ తేదీ లోపు వినుకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సీడీపీవో తెలిపారు.

ప్రభుత్వ తీరుపై సచివాలయ ఉద్యోగుల నిరసన



నాదెండ్లలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

నాదెండ్ల: వలంటీర్ల పనులను సచివాలయ సిబ్బందితో బలవంతంగా చేయిస్తూ ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ సభ్యులు శనివారం డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీన అధికారికంగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వానికి సమస్యలు విన్నవించామన్నారు. రాష్ట్ర పరిపాలనలో ప్రాణ వాయువు లాంటి సచివాలయ ఉద్యోగుల శక్తిని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు కేటాయించి అధిక పనిభారం మోపుతున్నారని వాపోయారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

ఆంగ్ల భాషపై ఆసక్తి పెంచటం అభినందనీయం



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిలకలూరిపేట: విద్యార్థులకు ఆంగ్లం పట్ల ఆసక్తి పెంచేందుకు ఆంగ్ల ఉపాధ్యాయుడు షేక్ మొహమ్మద్ యాసిన్ చేస్తున్న కృషి అభినందనీయమని పసుమర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.హనుమంతరావు చెప్పారు. మండలంలోని పసుమర్రులోని జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు ఆంగ్లంలో వందకు 90 మార్కులు పైబడి తెచ్చుకున్న 9 మందికి ఆంగ్ల ఉపాధ్యాయుడు యాసిన్ ఒక్కొక్కరికీ రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతులు శనివారం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఏటా పదో తరగతిలో 90 మార్కులు పైబడి తెచ్చుకున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే గత ఏడాది 11 మంది విద్యార్థులకు, అంతకు ముందు ఏడాది 21 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దె హరిబాబు, విశ్రాంత హెచ్ఎం బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలు ప్రైవేటు ఆలోచన విరమించుకోవాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి

నరసరావుపేట: పేద విద్యార్థులు మెడిసిన్ చదివే అవకాశం కల్పిస్తూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల సాంబశివారెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం పత్రికలకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చాలామంది తల్లిదండ్రులు తమపిల్లలను వైద్యులుగా తీర్చిదిద్దాలని కలలు కంటారని, గతంలో రాష్ట్రంలో మెడికల్ సీట్లు లేక రష్యా, జార్జియా, ఉక్రెయిన్ వంటి దేశాలు పంపించే పరిస్థితి ఉండేదన్నారు. గత వందేళ్లలో 12 మెడికల్ కాలేజీలు ఉంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో 17 మెడికల్ కాలేజీలు పర్మిషన్ తీసుకొచ్చి అందులో ఏడు కాలేజీలు పూర్తి చేసి ఇంకా పది కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయని అన్నారు. గత 100 ఏళ్లలో ఆంధ్ర రాష్ట్రంలో 2350 మెడికల్ సీట్లు ఉంటే తన హయాంలో 2560 కొత్త మెడికల్ సీట్లు తెచ్చి అందులో పేద విద్యార్థులకు 50శాతం ఉచితంగా మిగతా 50 శాతంపై తక్కువ ఫీజులో పేద విద్యార్థులకు మెడిసిన్ చదివే అవకాశం కల్పించారన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్స్, మెడికల్ కాలేజీలు పెట్టి ప్రతి పేదవాడి దగ్గరకే వైద్యం అందే ఆలోచన చేశారన్నారు. చంద్రబాబు నాయుడు మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఒక మెడికల్ కాలేజీ కట్టకపోగా జగన్‌మోహనరెడ్డి కట్టిన మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ చేస్తారని ప్రకటించటం దారుణమన్నారు. ఈ ఆలోచన విరమించుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పది



ఉపాధ్యాయులతో మదార్‌సాహెబ్, వేణుబాబు,

మాచర్ల: చదువు జీవితానికి గొప్ప సంస్కారం సభ్యత గౌరవం కల్పిస్తాయి అని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చక్రధర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విజ్ఞానం మనిషికి మూడవ నేత్రం లాంటిదన్నారు. చదువుకున్న వారు చదువుని అందరికీ పంచి అందరిలో కనువిప్పు తీసుకొని రావాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణు బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఆదర్శ ఉపాధ్యాయులుగా ఎదగాలన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ షేక్ అఫ్జల్ మాట్లాడుతూ విద్య అందరికీ అందించినప్పుడే నిజమైన ఉపాధ్యాయుడన్నారు. అటువంటి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నందుకు మనం గర్వపడాలన్నారు. రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ రామకృష్ణారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ గౌరవప్రదమైందని వివరించారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

నరసరావుపేట రూరల్: ఎరువుల కృతిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ పీఏసీఎస్‌ను శనివారం జగ్గారావు సందర్శించారు. పీఏసీఎస్ గొడన్‌లోని స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎరువులు అమ్మిన వెంటనే ఇంటిగ్రేటెడ్ ఫర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టంలో ఎరువులు అమ్మిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. రైతులకు ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా అమ్మితో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారి గోపిరెడ్డిలు పాల్గొన్నారు.

స్టడీ టేబుల్ వితరణ

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని కొచ్చర్ల ఉప్పరపాలెం గ్రామంలో యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సారథ్యంలో అంగన్‌వాడీ సెంటరుకు స్టడీ టేబుల్ లంచ్ బాక్సులు వితరణ చేసినట్లు అనిల్‌రాజ్ శనివారం తెలిపారు. మాజీ సర్పంచ్ కూరాకుల శ్రీదేవి మాట్లాడుతూ దాతలు సహకారాన్ని సెంటరు నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.